సాక్షి రంగారెడ్డి

శనివారం : 10 : ఫిబ్రవరి : 2024



బదిలీలపై ఫోకస్

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో తన మార్క్ పాలనపై ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టి సారించారు. 8లో▸



రైతు ఆందోళన

పురుగు మందు డబ్బాతో ఓ రైతు మంచాల సబ్ స్టేషన్ వద్ద శుక్రవారం హల్‌చల్ చేశాడు. 8లో▸



'వక్ఫ్'పేరిట చెరువు కబ్జా

వక్ఫ్ భూమి పేరిట చెరువును కబ్జా చేస్తున్నారని.. అడ్డుకోవాలని గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం నూతన ఎన్నిక



ఆంజనేయులును సన్మానిస్తున్న రాష్ట్ర కమిటీ నాయకులు

చేవెళ్ల: మోడల్ స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా చేవెళ్ల మోడల్ స్కూల్ పీడీ ఎం.ఆంజనేయులు రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని వాసవి ఆడిటోరియంలో గురువారం మోడల్ స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో పీఆర్‌టీయూ తెలంగాణ వ్యవస్థాపకుడు, టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. చేవెళ్ల మోడల్ స్కూల్‌కు చెందిన పీడీ ఎం.ఆంజనేయులును రెండోసారి రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆంజనేయులు చేవెళ్లలో విలేకరులతో మాట్లాడారు. తనపై నమ్మకంతో రాష్ట్ర బాధ్యతలు రెండోసారి అప్పగించిన రాష్ట్ర కమిటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికతో తనపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. జీఓ నంబర్ 254 ప్రకారం జరిగిన అన్యాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కాంట్రాక్టు పద్ధతిలోకి మార్చేలా, మినిమం టైం స్కేల్ వచ్చే విధంగా, మోడల్ స్కూళ్లలో సమస్యల పరిష్కారానికి.. విద్యాభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

నూనె గింజల సాగుపై రైతులకు అవగాహన



రైతులకు తెల్ల కుసుమపై అవగాహన కల్పిస్తున్న సైంటిస్ట్ సతీశ్‌కుమార్ తదితరులు

షాబాద్: నూనె గింజల సాగులో యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు భారతీయ నూనె గింజల పరిశోధనా స్థానం ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డా.జి.డి.సతీశ్‌కుమార్, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్ పేర్కొన్నారు. కుసుమ పంట క్షేత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల పరిధిలోని తిర్మలాపూర్‌లో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెల్ల కుసుమ పంట సాగులో రైతులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. సంప్రదాయ నూనె గింజల పరిశోధనా స్థానం రాజేంద్రనగర్ వారు అభివృద్ధి చేసిన విత్తనాలకు పంట ఎదుగుదల, దిగుబడిపై వివరించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు వచ్చే పంటలు సాగు చేసుకోవాలని అన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో నూనె గింజల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ మంగేష్‌దుబే, కురేషి, సురేష్, జవహర్, సుగుణ మాల రైతు ఉత్పత్తి దారుల సంఘం గౌరవ అధ్యక్షుడు లింగం, డైరెక్టర్లు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఉపసర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

తాగిన మైకంలో తల్లిని చంపిన కొడుకు



లలిత మృతదేహం

ఇబ్రహీంపట్నం రూరల్: మద్యం మత్తులో ఓ కొడుకు.. కన్నతల్లిని హత్య చేసిన ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొంగరకలాన్‌కు చెందిన కొయ్యడ లలిత, మైసయ్య దంపతులు గ్రామ పంచాయతీలో కార్మికులుగా పని చేసేవారు. లలిత (51) ఆరోగ్యం బాగోలేకపోవడంతో కొన్నాళ్లుగా ఇంటి వద్దే ఉంటోంది. మద్యానికి బానిసైన వీరి కొడుకు పెంటయ్య రోజూ తాగి వచ్చి తల్లిని ఇబ్బంది పెట్టేవాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి కూడా ఆమెతో గొడవ పడ్డాడు. విషయాన్ని మనసులో పెట్టుకుని శుక్రవారం తెల్లవారుజామున నిద్రలో ఉన్న తల్లి మెడకు చున్నీ బిగించి హత్య చేశాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. పెంటయ్యను అదుపులోకి తీసుకుని విచారించగా తానే హత్య చేసినట్లు నేరం అంగీకరించారు. దీంతో అతన్ని రిమాండ్‌కు తరలించారు.



చైర్‌పర్సన్‌ను తొలగించడానికి చేతులు ఎత్తిన కౌన్సిలర్లు



కంటతడి పెడుతున్న ఆర్తిక గౌడ్

అవిశ్వాసమే నెగ్గింది

వీడిన ఉత్కంఠ

- ఆదిబట్ల మున్సిపాలిటీలో ముగిసిన బలపరీక్ష
- అవిశ్వాసంలో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌ల తొలగింపు
- ఏకగ్రీవంగా ఆమోదించిన పాలకవర్గం
- కంటతడిపెట్టిన మాజీ చైర్‌పర్సన్ ఆర్తిక
- సమావేశాన్ని అడ్డుకునేందుకు యత్నం
- ఆందోళనకారులను అరెస్టు చేసిన పోలీసులు



ఆందోళనకారులను అడ్డుకుంటున్న పోలీసులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీలో కొద్దిరోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెర పడింది. చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ తొలగించడానికి ప్రవేశ పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. అన్ని పార్టీల కౌన్సిలర్లు ఏకమై చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్ తొలగింపునకు ఏకగ్రీవంగా ఆమోదించారు. అవిశ్వాసంపై శుక్రవారం ప్రిసైడింగ్ అధికారి, ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఉదయం 10 గంటలలోపే కౌన్సిలర్లు మర్రి నిరంజన్‌రెడ్డి, నల్లబోలు లావణ్య, మర్రి అర్చన, కుంట్ల మౌనిక, కంతి సంధ్య, కృష్ణరాజు, గోపగల్ల మహేందర్,వనం శ్రీనివాస్, పొట్టి రాములు, హరిదాసుగౌడ్, కోల నాగేష్, కమాండ్ల యాదగిరి మున్సిపల్ కార్యాలయానికి చేరుకు న్నా రు. 10 గంటలకు చైర్‌పర్సన్‌పై అవిశ్వాస సమావేశం నిర్వహించారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలకు చెందిన 13 మంది కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. దీంతో చైర్‌పర్సన్ ఆర్తికగౌడ్‌ను తొలగిస్తూ ప్రిసైడింగ్ అధికారి ఆదేశాలు జారీ చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు వైస్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస సమావేశం ప్రారంభించారు. మరోసారి 13 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. దీంతో వైస్ చైర్‌పర్సన్‌గా ఉన్న కోరె కళమ్మను తొలగిస్తున్నట్లు ప్రకటించారు.

నచ్చజెప్పినా ససేమిరా..

సమావేశానికి ముందు ఆర్తిక గౌడ్ వెళ్లి కౌన్సిలర్లకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఎవరూ ఆమె మాట వినకపోవడంతో కంటతడి పెడుతూ బయటకు వచ్చారు. అంతకు ముందు చైర్‌పర్సన్ కుటుంబ సభ్యులతో పాటు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో సమావేశాన్ని అడ్డుకోవడానికి వచ్చారు. బారికేడ్లను తొలగించే ప్రయత్నం చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. మహేశ్వరం జోన్ డీసీపీ సునితారెడ్డి, అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం ఏసీపీలు దగ్గరుండి బందోబస్తును పర్యవేక్షించారు.

చక్రం తిప్పిన మర్రి నిరంజన్‌రెడ్డి..

కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీలకు చెందిన 13 మంది కౌన్సిలర్లను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురైన మర్రి నిరంజన్‌రెడ్డి ఏకం చేశారు. తనకు అనుకూలంగా మలుచుకున్నారు. ఉదయం కడ్తాల్ నుంచి నేరుగా నాదర్‌గుల్‌కు చేరుకొని 8.30 గంటలకు కౌన్సర్లతో కలిసి, పోలీసుబందోబస్తు మధ్య మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. సినీ ఫక్కీలో కౌన్సిలర్లను తరలించడాన్ని చూసి పోలీసులే అవాక్కయ్యారు.

నూతన చైర్మన్ ఎన్నిక ఎప్పుడో?

అనుకున్నట్టుగానే చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం నెగ్గేలా చేశారు. ముందుగా వైస్ చైర్‌పర్సన్ తొలగించొద్దని అనుకున్నా చివరికి ఆమెపై కూడా అవిశ్వాసం పెట్టారు. నిరంజన్‌రెడ్డి కొత్త చైర్మన్‌గా కావడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఇక ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ కోసం వేచి చూడాల్సిందే.



నులిపురుగుల నివారణపై పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శశాంక, ఇతర అధికారులు

నులిపురుగులను నివారించాలి

కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం రూరల్: ఒకటి నుంచి 19 సంవత్సరాల లోపు వయసువారందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు వేయాలని కలెక్టర్ శశాంక వైద్యాధికారులకు సూచించారు. జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో చేపట్టాలని కోరుతూ శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నులిపురుగలతో పిల్లల్లో ఎదుగుదల లోపించడం, మందబుద్ధి, రక్తహీనత, చదువుపై ఏకాగ్రత కోల్పోవడం వంటి రుగ్మతలకు లోనవుతారని అన్నారు. దీనిని నివారించేందుకు ప్రభుత్వం ఏటా రెండు విడతలుగా నివారణ మాత్రలు పంపిణీ చేస్తోందని తెలిపారు. ఈనెల 20న జిల్లా వ్యాప్తంగా అన్ని వసతిగృహాలు, విద్యా సంస్థలు, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలు, కిశోరబాలబాలికల సంఖ్యకు అనుగుణంగా ప్రతి ఒక్కరికీ మాత్రలు వేయాలని ఆయన సూచించారు. ఒకటి నుంచి 19 ఏళ్ల లోపు 8,09,357 మందికి 40 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా 1,774 మంది ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బందితో టీచర్లను సమన్వయం చేసి ఏర్పాట్లు చేశామన్నారు. ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకు క్యాంపెయిన్ ఉంటుందని.. 9 నెలల వయస్సు పిల్లలకు విటమిన్ ఏ ద్రావకం తాగించాలన్నారు. దీనిపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. మార్చి 3న పల్స్ పోలియో నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, జెడ్పీ సీఈఓ దిలీప్‌కుమార్, డీఆర్‌డీఓ పీడీ ప్రభాకర్, ఇన్‌చార్జి డీపీఓ సంధ్యారాణి, సంక్షేమ అధికారి పద్మజ, జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాల్సిన బాధ్యత తహసీల్దార్లదేనని కలెక్టర్ శశాంక స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను పరిరక్షించే బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందని అన్నారు. ఆర్డీఓ, మండల కార్యాలయాల్లో ప్రభుత్వ భూముల రికార్డులను పరిశీలించి, కబ్జాలకు గురికాకుండా చూడాలని సూచించారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా వివిధ విద్యాసంస్థలు, పరిశ్రమలు, హెచ్‌ఎండీఏ, ఇతర అవసరాలకు కేటాయించిన ప్రభుత్వ భూముల రికార్డులను సమర్పించాలని కోరారు. జిల్లాలోని చెరువులు కబ్జాలకు గురికాకుండా ఎఫ్‌టీఎల్‌లను గుర్తించాలని తెలిపారు. అక్రమ ఇసుక, మట్టి తవ్వకాలు జరగకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి మండల అధికారులు కచ్చితంగా హాజరు కావాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్వీకరించిన ఫిర్యాదులను నమోదు చేసేందుకు రిజిస్టర్ నిర్వహించాలని సూచించారు. రిజిస్టర్‌లో నమోదు చేయడం ద్వారా ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి? ఎన్ని పరిష్కరించారు? ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి? వంటి వివరాలు తెలుస్తాయని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి, ఆర్డీఓలు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వ్యభిచార ముఠా గుట్టు రట్టు

- కనకమామిడిలోని ఫాంహౌస్‌పై ఎస్‌ఓటీ పోలీసుల దాడి
- పట్టుబడ్డ ఇద్దరు నిర్వాహకులు, నలుగురు విటులు, వాచ్‌మన్, ముగ్గురు మహిళలు

మొయినాబాద్: రెండు నెలలుగా వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ ఫాంహౌస్‌పై ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేశారు. ఇద్దరు నిర్వాహకులతోపాటు నలుగురు విటులు, వాచ్‌మన్, ముగ్గురు మహిళలను పట్టుకున్నారు. ఈ సంఘటన మండల పరిధిలోని కనకమామిడి రెవెన్యూలో ఉన్న హ్యాపీ హోమ్స్‌లోని రాజు ఫాంహౌస్‌లో గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి కథనం ప్రకారం.. కనకమామిడి రెవెన్యూలో ఉన్న హ్యాపీహోమ్‌లో నగరానికి చెందిన రాజు ఫాంహౌస్ ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రికి చెందిన శ్రీనివాస్, మొయినాబాద్‌కు చెందిన రాజు కలిసి ఫాంహౌస్‌ను లీజుకు తీసుకున్నారు. ఆంధ్ర ప్రాంతం నుంచి మహిళలను తీసుకొచ్చి ఫాంహౌస్‌లో రెండు నెలలుగా వ్యభిచారం నిర్వహిస్తున్నారు. నగరంతోపాటు పరిసర గ్రామాల నుంచి ఫాంహౌస్‌కు వచ్చే యువకుల వద్ద డబ్బులు తీసుకుని మహిళలతో వ్యభిచారం చేయిస్తున్నారు. ఈ క్రమంలో విశ్వసనీయ సమాచారంతో గురువారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ పోలీసులు, స్థానిక పోలీసులతో కలిసి దాడి చేశారు. నిర్వాహకులు శ్రీనివాస్, రాజుతోపాటు నలుగురు యువకులు (విటులు), వాచ్‌మన్, ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.17,880 నగదు, 11 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడినవారిని మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి నిందితులను శుక్రవారం సాయంత్రం రిమాండ్‌కు తరలించారు.



పోలీసులకు పట్టుబడిన నిందితులు

108 అంబులెన్స్‌లో ఆకస్మిక తనిఖీ

యాచారం: మండల కేంద్రంలోని 108 అంబులెన్స్‌ను శుక్రవారం 108 సేవల జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వసంత పాపయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనంలో ఉన్న పరికరాలు, ఇంజక్షన్లు, ఇతర అత్యవసర మందులు అందుబాటులో ఉన్నాయా.. లేదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సమాచారం వచ్చిన వెంటనే స్పందించి వెళ్తున్నారా.. నిత్యం ఏఏ కేసులపై సమాచారం వస్తోంది తదితరాలపై ఆరా తీశారు. అత్యవసర పరిస్థితుల్లో వాడాల్సి న మందులు, ఇంజక్షన్లు నిల్వ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

భూముల చుట్టే వివాదాలు

- జిల్లాలో భారీగా కొనుగోళ్లు
- ప్రజాప్రతినిధులు, అధికారుల గుట్టురట్టు
- ఒక్కొక్కటిగా బయటపడుతున్న వైనం
- లెక్క తీస్తుండటంతో అధికారుల్లో ఆందోళన



సాక్షి, రంగారెడ్డిజిల్లా: భూముల కొనుగోళ్ల వ్యవహారం గత ప్రభుత్వంలోని పెద్దలతో అంటకాగిన అధికారుల కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. అధికారం మాటున అక్రమార్జనకు పాల్పడటంతో పాటు జిల్లాలో భారీగా భూ కొనుగోళ్లకు పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు, బంధువులు, బినామీ పేరున పెద్ద ఎత్తున భూములు కొనుగోలు చేశారు. ఇటీవల బీఆర్‌ఎస్ ప్రభుత్వం దిగిపోవడం, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆయా అధికారుల అక్రమాలు ఒక్కొక్కటిగా బయటికి వస్తుండటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రభుత్వం నిర్వహించిన భూ సేకరణ, ఉపాధి కల్పన, పెట్టుబడులతో పేరుతో దేశవిదేశాలకు చెందిన కంపెనీల రాక, వాటికి కేటాయించిన భూముల వివరాలు ఆయా విభాగాల్లోని ఉన్నతాధికారులకు ముందే తెలియడం, వారు తమ బినామీలను రంగంలోకి దింపి..రైతుల నుంచి అగ్గువకు భూములు కొట్టేయడం, ఆ తర్వాత ఆయా భూముల్లో రియల్ ఎస్టేట్ సంస్థలకు అప్పగించి భారీగా సొమ్ము చేసుకోవడం వంటి అంశాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి.

మాజీ సీఎస్ మొదలు..

మాజీ సీఎస్ సోమేష్‌కుమార్ వట్టినాగులపల్లి సహా యాచారం మండలాల్లో పెద్ద ఎత్తున భూములు కొనుగోలు చేసినట్లు ఆరోపణలు రాగా, ఆ తర్వాత మాజీ డీజీపీపై కూడా విమర్శలు వెల్లువెత్తాయి. ఇటీవల ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన కేసులో అరెస్టు అయిన హెచ్‌ఎండీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివబాలకృష్ణ సైతం వట్టినాగులపల్లి, శంషాబాద్, శంకర్‌పల్లి విల్లాలు, అపార్ట్‌మెంట్లలో ప్లాట్లు, వ్యవసాయ భూములు కొనుగోలు చేశారు. హెచ్‌ఎండీఏ మాజీ కమిషనర్ అర్వింద్‌కుమార్ కూడా జిల్లాలో భారీగా భూములు కొనుగోలు చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వివాదాస్పద భూములకు అనుమతులు ఇప్పించి, భారీగా సొమ్ము చేసుకున్నట్లు తెలిసింది. నార్సింగి, వట్టినాగులపల్లిలోని పలు వివాదాస్పద భూములకు క్లియరెన్స్ ఇప్పించి, ఇందుకు ప్రతిఫలంగా మహేశ్వరం మండలం మంఖాల్ రెవెన్యూ పరిధిలోని ఓ ప్రముఖ వెంచర్‌లో విలువైన ప్లాట్‌ను గిఫ్ట్‌గా పొందారనే ఆరోపణలు లేకపోలేదు. ఆయా అక్రమార్కులపై పలువురు సామాజిక వేత్తలు, అధికార పార్టీ నేతలు మీడియా సాక్షిగా ఆరోపణలు గుప్పించడంతో పాటు వారి అక్రమాల చిట్టాను ఐటీ, ఏసీబీ సంస్థలకు అందజేస్తున్నారు. విచారణ జరిపించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆ అధికారుల కంటికి కునుకు కరువే..

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోని మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, వారితో అంటకాగిన అప్పటి ఉన్నతాధికారుల అక్రమాలు ఒక్కొక్కటిగా బయటికి వస్తుండటంతో యాచారం, కడ్తాల్, మొయినాబాద్, శంకర్‌పల్లి, షాబాద్, శంషాబాద్, మహేశ్వరం పరిసరాల్లో భూములు కొనుగోలు చేసిన ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లకు సైతం కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ముఖ్యంగా హెచ్‌ఎండీఏ, జిల్లా రెవెన్యూ, పోలీసు విభాగాల్లో పని చేసిన అధికారుల్లో టెన్షన్ మొదలైంది. ఎప్పుడు ఏ పిడుగులాంటి వార్త వినాల్సి వస్తుందో? అనే ఆందోళన మొదలైంది. ఐటీ, ఏసీబీ దాడులు జరిగే అవకాశం ఉండటంతో వారంతా జాగ్రత్తపడుతున్నారు. ఇప్పటికే వారి ఇంట్లోని బీరువాల్లోనే కాదు బ్యాంకు లాకర్లలో భద్రంగా దాచుకున్న నగదు, నగలు, విలువైన ఆస్తులకు సంబంధించిన పత్రాలను ఎవరికీ అనుమానం రాకుండా దూరపు బంధువులు, బినామీలు, స్నేహితుల ఇళ్లకు తరలించినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

పురుగు మందు డబ్బాతో రైతు ఆందోళన



మంచాల సబ్‌స్టేషన్ ఎదుట పురుగు మందు డబ్బాతో రైతు సత్తయ్య

కౌన్సెలింగ్ ఇచ్చి పంపిన పోలీసులు

మంచాల: పురుగు మందు డబ్బాతో ఓ రైతు మంచాల సబ్ స్టేషన్ వద్ద శుక్రవారం ఆందోళనకు దిగాడు. వివరాల ప్రకారం.. తిప్పాయిగూడకు చెందిన రైతు జెనిగె సత్తయ్య బోరు మోటారు విద్యుత్ సమస్య కారణంగా సక్రమంగా పనిచేయడం లేదు. దీంతో ఆయన సమస్య పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులను పలుమార్లు కోరినా స్పందించలేదు. వరి పంట ఎండిపోయే ప్రమాదం ఉందని పురుగు మందు డబ్బాతో సబ్‌స్టేషన్ వద్దకు వచ్చాడు. గమనించిన ఏఈఈ సత్యనారాయణ వెంటనే మంచాల పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు రైతు సత్తయ్యను ఠాణాకు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు. ఇదే విషయమై విద్యుత్ శాఖ ఏఈఈ వివరణ కోరగా సత్తయ్య పొలం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఆరు బోరు బావులకు కనెక్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కేవలం నాలుగు కనెక్షన్లున్నాయి. డీడీ కట్టిన రైతులకు కనెక్షన్ ఇస్తుండగా రైతు ఒప్పుకోకుండా పురుగు మందు డబ్బా తీసుకుని సబ్‌స్టేషన్‌కు వచ్చాడని తెలిపారు.

గవర్నర్‌కు ఘన స్వాగతం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని ఐఐఎంఆర్ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు స్థానిక బీజేపీ నాయకులు శుక్రవారం ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, డివిజన్ అధ్యక్షుడు జి.బాబురావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పులి మామిడి రవీందర్, డివిజన్ ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఇ.వేణుగోపాల్, ఎన్.స్వామి, రఘుమారెడ్డి, కె.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల లోగో ఆవిష్కరణ



లోగో ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల సంఘం లోగోను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం అసెంబ్లీ ఆవరణలో ఆవిష్కరించారు. సంఘానికి అన్నివిధాలా సహాయసహకారాలు అందజేస్తానని ఈ సందర్భంగా సీఎం పేర్కొన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న జర్నలిస్టుల సంక్షేమం, వారి అభివృద్ధి కోసం గత ప్రభుత్వం విఫలమైన నేపథ్యంలో ఉద్యమ జర్నలిస్టుల సంఘం ఏర్పాటు చేస్తున్నామని, నూతన ఉత్తేజంతో యువ జర్నలిసులను కూడా కలుపుకుని పోయేందుకు కృషి చేస్తున్నట్లు టీయూజేఎస్ కన్వీనర్ ఎం.ఎం.రహమాన్ తెలిపారు. ముఖ్యమంత్రి తమ విజ్ఞప్తికి స్పందించి లోగోను ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. ఉద్యమ జర్నలిస్టుల సంఘాన్ని అత్యున్నత ప్రాధాన్యతలో గుర్తించాలని, అక్కడికక్కడే సమాచార శాఖ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసినందుకు సీఎంకు రహమాన్ కృతజ్ఞతలు తెలిపారు.

బదిలీలపై ఫోకస్

- ఇప్పటికే సీఐలు ట్రాన్స్‌ఫర్స్
- ఎస్ఐలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలకు స్థానచలనం..?
- ప్రక్షాళనపై ఎమ్మెల్యే నజర్



ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం

యాచారం: ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో తన మార్క్ పాలనపై ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టి పెట్టారు. ముందుగా అనుకున్నట్లుగానే డివిజన్‌లోని ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల, హయత్‌నగర్, యాచారం, మంచాల, అబ్దుల్లాపూర్‌మెట్, హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ల సీఐల బదిలీలు పూర్తయ్యాయి. త్వరలో అన్ని ఠాణా ఎస్ఐలను సైతం ట్రాన్స్‌ఫర్ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కొన్ని స్టేషన్లల్లో పరిధిలో ఎస్ఐలు సివిల్ తగాదాల్లో, అనవసర విషయాల్లో అతి జోక్యం చేసుకుంటున్నారని రాచకొండ సీపీకి ఫిర్యాదులు సైతం అందాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సిఫారసు లేఖలతో బదిలీలపై వచ్చిన సీఐలు అప్పట్లో బీఆర్ఎస్ నేతలకే ప్రాధాన్యతనిస్తూ సామాన్య ప్రజల ఫిర్యాదులకు సైతం స్పందించే వారు కాదనే ఆరోపణలున్నాయి. పార్లమెంట్ ఎన్నికలలోపే ఆయా పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, కానిస్టేబుళ్లను బదిలీ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. రాష్ట్ర స్థాయి బదిలీల్లో ఇబ్రహీంపట్నం ఏసీపీ సైతం బదిలీ అయ్యే అవకాశాలున్నట్లు అధికార పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు.

తహసీల్దార్లు, ఎంపీడీఓలు సైతం..

తహసీల్దార్లు, ఎంపీడీఓల బదిలీలపై సైతం నజర్ వేసినట్లు తెలుస్తోంది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో మూడేళ్లు పనిచేసిన ఎంపీడీఓ, తహసీల్దార్లను బదిలీలు చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో తమకు అనుకూలంగా లేని తహసీల్దార్లు, ఎంపీడీఓలను ట్రాన్స్‌ఫర్ చేయాలని ఎమ్మెల్యేపై ఒత్తిడి పెంచారు. డివిజన్ పరిధిలోని ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల, అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్ తహసీల్దార్లు, ఎంపీడీఓలు ఏ క్షణమైనా బదిలీ అవుతారనే చర్చలు జోరందుకున్నాయి. గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి ప్రత్యేకాధికారులుగా తహసీల్దార్లు, ఎంపీడీఓలు ఉన్నారు. మండల స్థాయిలో ఎంపీడీఓలు పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. ఇటువంటి సమయంలో వారిని మార్చితే గ్రామ పరిపాలనలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఉన్నతాధికారులు భావిస్తున్నారట.

సార్.. మీ వద్ద పనిచేస్తాం

మహానగరంలో నివాసం ఉండి సరిహద్దు జిల్లాలైన నల్గొండ, నాగర్‌కర్నూల్, వికారాబాద్, మహబూబ్‌నగర్ తదితర జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న పలు శాఖల అధికారులు నిత్యం ఎమ్మెల్యేను కలుస్తున్నారు. పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ, ఈజీఎస్, డీఆర్‌డీఓ, వ్యవసాయ శాఖ, ఐసీడీఎస్, మున్సిపల్ శాఖల్లో అధికారులు ఐదేళ్లకు మించి ఇక్కడే విధులు నిర్వరిస్తున్నారు. వారి స్థానంలో బదిలీపై వచ్చేందుకు పలు జిల్లాల్లో పనిచేసే ఆయా శాఖల అధికారులు ఎమ్మెల్యేను ప్రసన్నం చేసుకునేందుకు క్యూ కడుతున్నారు. నిత్యం తొర్రూర్ క్యాంపు కార్యాలయం వద్ద ఆ అధికారులే అధికంగా తచ్చాడుతున్నారు.

సిఫారసు లేఖలుండవు



ఆయా శాఖల అధికారులు సాధారణ బదిలీల్లోనే వస్తు, పోతున్నారు. ఏ ఒక్క అధికారిని తన పరిధిలోని మండలాల్లో విధులు నిర్వర్తించడానికి బదిలీ చేయమని ఏ ఉన్నతాధికారికి ప్రతిపాదనలు చేయలేదు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని పక్కాగా అమలు చేసే అధికారులకే తన వద్ద స్థానం. అక్రమాలకు పాల్పడితే ఆ అధికారులే బాధ్యులు అవుతారు. ప్రజలకు సుపరిపాలన అందించాలన్నదే తన లక్ష్యం.

– మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్యే, ఇబ్రహీంపట్నం

అవిశ్వాసానికి ముహూర్తం ఫిక్స్!

- ఈ నెల 22న మణికొండ మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం
- కౌన్సిలర్లకు నోటీసులు అందించిన అధికారులు
- ఆర్డీఓ ఆధ్వర్యంలో ఓటింగ్
- విజయంపై ఎవరి ధీమా వారిదే



మణికొండ మున్సిపల్ కార్యాలయం

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ చైర్మన్ కస్తూరి నరేందర్‌ముదిరాజ్‌పై అవిశ్వాసం తీర్మానం పెడుతూ 10 మంది కౌన్సిలర్లు ఇచ్చిన నోటీసును అధికారులు పరిగణలోకి తీసుకున్నారు. ఈ మేరకు వారి సంతకాల పరిశీలనను అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. తదుపరి చర్యగా ఈనెల 22వ తేదీన ఉదయం 11 గంటలకు, 2019 మున్సిపల్ చట్టం సెక్షన్ 37 ప్రకారం ప్రత్యేక సమావేశం ఏర్పాటుకు ముహూర్తం ఖరారు చేశారు. మీటింగ్‌కు హాజరు కావాలని కలెక్టర్ జారీ చేసిన నోటీసులను స్థానిక అధికారులు కౌన్సిలర్లకు అందజేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో రాజేంద్రనగర్ ఆర్డీఓ మల్లయ్య ఆధ్వర్యంలో ఓటింగ్ నిర్వహించనున్నారు.

ఎవరి ధీమా వారిదే..

అవిశ్వాస తీర్మానంపై ఇరుపక్షాలు ధీమాగానే ఉన్నాయి. అయితే తనపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే ప్రతిపక్షాలకు మొత్తం 13 మంది సభ్యుల సహకారం లభించే అవకాశమే లేదని, అది వీగిపోవడం తప్పదని చైర్మన్ వర్గీయులు ధీమాగా ఉన్నారు. కౌన్సిలర్లకు అడిగినంత డబ్బు ఇవ్వనందునే అవిశ్వాస తీర్మానం పెడుతున్నారని, దీనిని రాబోయే రోజుల్లో ప్రజల వద్దనే తేల్చుకుంటామని పేర్కొంటున్నారు. అదే స్థాయిలో తీర్మానం పెట్టిన కౌన్సిలర్లు ఇప్పటికే తమకు 12 మంది సభ్యుల బలం ఉందని, ప్రస్తుతం మరో ముగ్గురు ఓటింగ్‌లో పాల్గొని తమకు మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గుతుందని వారు ధీమాగా పేర్కొంటున్నారు.

మణికొండలో రివర్స్ గేర్..

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలలో బీఆర్ఎస్‌కు చెందిన వారు చైర్మన్లుగా ఉండడం, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం మారడంతో ఆయా మున్సిపాలిటీల సభ్యులు కాంగ్రెస్‌లో చేరి అవిశ్వాసాలు పెడుతున్నారు. అందుకు భిన్నంగా మణికొండ మున్సిపాలిటీలో కాంగ్రెస్‌కు చెందిన చైర్మన్‌పైనే ప్రతిపక్షాలతో పాటు అదే పార్టీకి చెందిన కొందరు కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టారు. సదరు మున్సిపల్ చైర్మన్ ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన వ్యక్తి కావడంతో నియోజకవర్గవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఏదిఏమైనా ఈనెల 22వ తేదీన జరిగే సమావేశంలో అవిశ్వాస తీర్మానం నెగ్గుతుందా..?లేక వీగిపోతుందా..? అనే అంశంపై మున్సిపాలిటీ పరిధిలోని ఏ ఇద్దరు కలిసినా చర్చించుకుంటున్నారు.

'వక్ఫ్'పేరిట చెరువు కబ్జా

- లేని భూమిని ఉన్నట్లుగా పత్రాలు
- పట్టించుకోని అధికారులు
- నెక్నాంపూర్ వాసుల ఆందోళన



వక్ఫ్ భూమిగా పేర్కొంటూ ఏర్పాటు చేసిన బోర్డులు

మణికొండ: ప్రభుత్వ భూమిని ఓ హౌసింగ్ సొసైటీకి సర్కారు పూర్తిగా విక్రయించింది. అయితే అదే సర్వే నంబర్‌లోనే తమకు భూమి ఉందని పత్రాలు చూపుతూ పక్కనే ఉన్న చెరువు భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు కొందరు. ఈ విషయంపై తహసీల్దార్ నుంచి కలెక్టర్ వరకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ గ్రామస్తులు సదరు భూమి వద్ద గురువారం ఆందోళనకు దిగారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. గండిపేట మండలం, నెక్నాంపూర్ రెవెన్యూ సర్వే నంబర్ 31లోని 59.14 ఎకరాల భూమిని 2002లో అప్పటి ప్రభుత్వం సెక్రటేరియట్ ఉద్యోగుల హౌసింగ్ సొసైటీకి ఎకరం రూ. 1.20 లక్షల చొప్పున అమ్మింది. ఇక అందులో ఎలాంటి ప్రభుత్వ భూమి లేదు. అయితే అదే గ్రామంలో పేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలనే ఉద్దేశంతో వారికి వి క్రయించిన భూమిలో నుంచే ఐదు ఎకరాలను ప్రభుత్వం తీసుకొని 242 మందికి 60 గజాల చొప్పున కేటాయించింది. తర్వాత అదే సర్వే నంబర్‌లోనే వక్ఫ్ బోర్డుకు 13.26 ఎకరాల భూమి ఉందని వక్ఫ్ బోర్డు, రాష్ట్ర ప్రభుత్వం 2005లో గెజిట్ జారీ చేశాయి. దాంతో అప్పటి నుంచి సదరు భూమి విషయంలో రెండు వర్గాల మధ్య వివాదంగా మారింది.

చెరువు భూమిలోకి చొరబాటు..

అయితే సర్వే నంబర్ 31లో వక్ఫ్ బోర్డుకు 13.26 ఎకరాల భూమి ఉందని వారి వద్ద పత్రాలు ఉండగా, అందులో భూమి లేకపోవడంతో పక్కనే ఉన్న నెక్నాంపూర్ పెద్ద చెరువుకు చెందిన సర్వే నంబర్ 44లోకి చొరబడి ప్రహరీలు, శ్మశాన వాటికలు నిర్మిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సర్వే నంబర్ 44లో చెరువుకు సంబంధించి 97.32 ఎకరాల భూమి ఉందని, చెరువులో ప్రస్తుతం నీరులేకపోవడంతో సదరు భూమితో పాటు బఫర్‌లో పెద్ద ఎత్తున నిర్మాణాలను చేపడుతున్నారు. ఇదే విషయంపై గండిపేట తహసీల్దార్, రాజేంద్రనగర్ ఆర్డీఓ, కలెక్టర్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. వారికి కేటాయించిన సర్వేనంబర్ ఒకటి అయితే పక్క సర్వే నంబర్‌లో నిర్మాణాలు చేపడుతున్నారని అందులో పేర్కొన్నారు.

గ్రామస్తుల ఆందోళన

తమ గ్రామానికి చెందిన చెరువు భూమిని వక్ఫ్ భూమిగా పేర్కొంటు కబ్జాకు పాల్పడుతున్నారని, ఈ విషయాన్ని ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీంతో స్థానిక కౌన్సిలర్ బి.పద్మారావు, బీఆర్ఎస్ నాయకులు జి.జయరాజ్, కె.ధన్‌రాజ్, కాంగ్రెస్ నాయకుడు తమోదన్‌రావు ఆధ్వర్యంలో వారు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు భూమిగా పేర్కొంటూ నిర్మాణాలు చేపడుతున్న భూమిలో గతంలో హరితహారంలో భాగంగా మొక్కలు నాటారని, వాటిని తొలగించడంతో పాటు చెరువులో మట్టి, రాళ్లు వేస్తున్నారన్నారు. ఆ పనులను అధికారులు వెంటనే ఆపాలని లేకుంటే తామే అడ్డుకుంటామని, ఈ విషయంలో రెండు వర్గాల మధ్య గొడవలు జరిగితే వారే బాధ్యత వహించాలన్నారు. నెక్నాంపూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి పార్లమెంట్ స్థాయి క్రికెట్ టోర్నీ

మొదటి బహుమతిగా రూ.3లక్షలు

చేవెళ్ల: చేవెళ్ల పార్లమెంట్ స్థాయి క్రికెట్ పోటీలు శనివారం నుంచి ప్రారంభమవుతాయని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నమెంట్‌ను కొండా వెంకట రంగారెడ్డి, జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 9.30గంటలకు కేవీఆర్ గ్రౌండ్‌లో విశ్వేశ్వర్‌రెడ్డి ప్రారంభిస్తారని నిర్వాహకులు చెప్పారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు చెందిన క్రికెట్ జట్లు ఈ పోటీలలో పాల్గొంటున్నట్లు తెలిపారు. మొదటి విజేతకు రూ.3లక్షలు, రన్నరప్‌కు రూ.2లక్షల నగదు బహుమతితో పాటు షీల్డ్‌లు అందజేస్తారని చెప్పారు.

పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం

28న బలపరీక్ష

అబ్దుల్లాపూర్‌మెట్: మండల కేంద్రంలోని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం చైర్మన్ లెక్కల విఠల్‌రెడ్డిపై సంఘం డైరెక్టర్లు తొమ్మిది మంది అవిశ్వాస తీర్మానం చేస్తూ జిల్లా సహకార అధికారికి ఫిర్యాదు చేశారు. మొత్తం 13 మంది డైరెక్టర్లకు గాను ఒక సభ్యుడు ఇటీవలే మృతి చెందగా మొత్తం 12 మంది సభ్యుల్లో తొమ్మిది మంది అవిశ్వాసం పెట్టాలంటూ ఫిర్యాదు చేశారు. అనంతరం ఆ తొమ్మిది మంది డైరెక్టర్లు క్యాంపునకు తరలివెళ్లినట్లు తెలిసింది. కాగా డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానం పెట్టడంతో బలపరీక్ష కోసం జిల్లా అధికారులు ఈనెల 28న సమావేశం నిర్వహించనున్నట్లు నోటీసులు జారీ చేశారు.

కోచింగ్‌కు వెళ్లిన విద్యార్థిని అదృశ్యం



ప్రవళిక(ఫైల్)

పహాడీషరీఫ్: కోచింగ్‌కు వెళ్లిన విద్యార్థిని అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పి.గురువారెడ్డి తెలిపిన ప్రకారం.. తుక్కుగూడ గ్రామానికి చెందిన మల్లెపు శ్రీనివాస్ కుమార్తె ప్రవళిక(21) ఇంటర్ వరకు చదివింది. ప్రస్తుతం దిల్‌సుఖ్‌నగర్‌లో రామయ్య కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకుంటుంది. ఈ నెల 8న ఉదయం కోచింగ్‌కు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది. కోచింగ్ సెంటర్ వద్దకు కూడా రాలేదని తెలుసుకున్న తండ్రి శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆచూకీ తెలిసిన వారు 87126 62367 నంబర్‌లో సమాచారం ఇవ్వాలని కేసు నమోదు చేసుకున్న పోలీసులు తెలిపారు.

పాఠశాల కిచెన్ షెడ్ దగ్ధం

కేశంపేట: మండల పరిధిలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో కిచెన్ షెడ్ దగ్ధమైంది. అల్వాల గ్రామంలోని పాఠశాలలో గురువారం భోజన నిర్వాహకురాలు సత్యమ్మ భోజనం వడ్డించి ఇంటికి వెళ్లిపోయింది. శుక్రవారం మధ్యాహ్నం భోజనం చేసేందుకు వెళ్లగా అప్పటికే షెడ్ పూర్తిగా దగ్ధమైనట్లు గ్రామస్తులు తెలిపారు. వంటకు ఉపయోగించే కలప, నిత్యావసర సరుకులు, షెడ్‌పై రేకులు కాలిబూడిదయ్యాయి. అల్వాల ఎంపీటీసీ సభ్యుడు సురేష్‌రెడ్డి, మండల విద్యాధికారి మనోహర్, కొత్తపేట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, పీఆర్టీయూ మండల అధ్యక్షులు శ్రీనివాససాగర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నారాయణ షెడ్‌ను పరిశీలించారు.